క్లుప్తంగా

ముమ్మరంగా ఈ-పంట నమోదు



వివరాలు నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

జి.సిగడాం: మండలంలోని 21 రైతుభరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. మంగళవారం నడిమివలస, జి.సిగడాం, ఎస్‌పీఆర్‌పురం గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాలు చేపట్టారు. విపత్తుల సమయంలో పంట నష్టం వాటిల్లితే పరిహారం అందేందుకు ఈ-క్రాప్ ఉపకరిస్తుందని సిబ్బంది చెబుతున్నారు. కార్యక్రమంలో ఏఈఓ కంబాల జగదీశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమరాపు సుగుణకరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల మంజూరుకు పరిశీలన



జె.ఆర్.పురంలో పింఛన్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

రణస్థలం: మండలంలో నూతనంగా మంజూరైన 219 పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలన చేస్తున్నామని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి అన్నారు. జె.ఆర్.పురం సచివాలయం పరిధిలో మంగళవారం వెరిఫికేషన్ చేపట్టారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని చెప్పారు. మండలంలో 11,196 పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు మృతికి సంతాపం



ఈశ్వర వెంకటరమణ మూర్తి

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు ఈశ్వర వెంకటరమణమూర్తి(కొండబాబు)(88) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన 50 ఏళ్లగా శర్మదా ఆయుర్వేద వైద్యశాల ద్వారా వైద్యం అందించారు. ప్రముఖ దేవీ ఉపాసకులు ఈశ్వర సత్యనారాయణ శర్మ మనుమడైన కొండబాబు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి పట్ల ఉపనిషన్మందిరం కార్యదర్శి విశ్వనాథం కామేశ్వరరావు, ఆరవెల్లి గుహానంద్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు



లావేరులో టీకాలు చేస్తున్న సిబ్బంది

లావేరు: మండలంలోని లావేరు, అదపాక, భరిణికాం, గుమడాం తదితర గ్రామాల్లో మంగళవారం వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బంది పశువులకు ఉచితంగా లంపీ స్కిన్ నివారణ టీకాలు చేశారు. వ్యాధి రాకుండా ముందస్తుగా పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో వీటిని వేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు జి.లక్ష్మీకాంతం, జి.గోపాల్, సిబ్బంది మామిడి జగదీష్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి

నరసన్నపేట: వెలుగు సీసీలు, ఇతర సిబ్బందికి నెల, రోజువారి నిర్దేశించిన లక్ష్యాలను విధిగా చేరుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నరసన్నపేట, జలుమూరు, పోలాకి, శ్రీకాకుళం రూరల్, గార మండలాలకు చెందిన సీసీలతోపాటు ఇతర సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పోలాకి సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అలసత్వం వహించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలు విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. లక్ష్యాలను అధిగమించిన సిబ్బందికి అభినందించడం జరుగుతుందన్నారు. నరసన్నపేట మహిళా మార్ట్‌లో లావాదేవీలు నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మండలాలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. పలు అంశాలపై పీడీ సమీక్ష చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో మరింత బాధ్యత చూపాలని, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరసన్నపేట ఏపీ కొండలరావు, నరసన్నపేట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చింతు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● ప్రత్యేక అలంకరణలో

విజయగణపతి

నగరంలోని పాలకొండ రోడ్డులో గల విజయగణపతి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

-శ్రీకాకుళం కల్చరల్



● సంతోషిమాతకు

శ్రావణ పూజలు

పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో నిజ శ్రావణ మంగళవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహించి, అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- శ్రీకాకుళం కల్చరల్



● ధాన్యలక్ష్మిగా

విజయదుర్గ

నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారిని నిజ శ్రావణ మంగళవారం సందర్భంగా ధాన్యలక్ష్మీగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్ర పుష్పార్చన జరిగింది. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో రజత విగ్రహానికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

- శ్రీకాకుళం కల్చరల్



నాలుగేళ్లలో నాలుగు దశాబ్దాల అభివృద్ధి

- విపక్షాల విష ప్రచారం తిప్పికొట్టండి
- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



కమ్యూనిటీ భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: కేవలం నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలనలో 40 సంవత్సరాల అభివృద్ధి జరిగిందని, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 14 ఏళ్లలో శ్రీకాకుళం జిల్లాలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. శ్రీకాకుళం నగర పరిధిలోని సీపాన్నాయుడుపేటలో వైఎస్సార్ సీపీ నేత సీపాన రామారావు అధ్యక్షతన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌లు పాదయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. శ్రీకాకుళం పెద్ద మార్కెట్‌ను గత ప్రభుత్వ హయాంలో అచ్చెన్నాయుడు, నారాయణ, ఎంపీ రామ్మోహన్‌నాయుడు అనేక సార్లు సందర్శించారని, ప్రతీసారి మేదరవీధి రోడ్డులో ఉన్న బుట్టలను తన్నారే తప్ప మార్కెట్‌ను ఏమీ అభివృద్ధి చేయలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రధానమైన రోడ్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో మార్కెట్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ప్రజలు మేలు కోరే ప్రభుత్వానికే అవకాశం ఇవ్వాలన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి తిరిగే పనిలేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. ఇటువంటి పాలన సంస్కరణలు తట్టుకోలేక ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పార్టీ అంటే అభిమానం ఉండొచ్చుకానీ ప్రజా వేదికల్లో ప్రజలను తప్పుతోవ పట్టించే అబద్ధపు మాటలు విపక్ష నేతలు మానుకోవాలన్నారు.

- వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కులం, మతం, పార్టీ, జెండా ఏమీ చూడకుండానే అర్హతే ప్రామాణికంగా అన్ని పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రూ.26.65 లక్షలు వ్యవయంతో నిర్మించిన మంచి నీటి సరఫరా పైపులైన్లను మంత్రి ధర్మాన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు సాధు వైకుంఠరావు, చల్లా అలివేలుమంగ, పైడి రాజారావు, పొన్నాడ రుషి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మంగళవారం తమ్మినాయుడుపేట, పూడివలస గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది ఎన్నికల ఏడాది కావటం వల్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బీఎల్‌వోలు తయారు చేస్తున్న ఓటర్ల జాబితాలు పరిశీలించాలన్నారు. అర్హులు తప్పితే ఓటర్లలో అవగాహన కల్పించి ఓట్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మురళీధర్‌బాబా, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, సర్పంచ్ జరుగుళ్ల కృష్ణ, నాయకులు పంచాది నరసింహమూర్తి, వావిలపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూముల సర్వేతో మేలు



గుర్రాలపాలెంలో డ్రోన్ కెమెరా ద్వారా సర్వేను ప్రారంభిస్తున్న షేక్‌చాన్‌బాషా

లావేరు: సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు కలుగుతుందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా అన్నారు. గుర్రాలపాలెంలో మంగళవారం సమగ్ర భూముల సర్వే ప్రారంభించారు. డ్రోన్ కెమెరా సిబ్బంది రైతుల భూముల ఫొటోలు తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భూసమస్యలు ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర భూముల సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జనపాల భానోజీరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శాంతాటి శ్రీనివాసరావు, గోవిందరావు, అల్లంపల్లి నాగరాజు, విశ్వనాథం, గట్టెం కృష్ణ, పాపారావు, ముకుందరావు, బాడ రమణ, లుట్ట శ్రీను, మోరం రాము, మాజీ వైస్ ఎంపీపీ మోరం సోంబాబు, వీఆర్‌ఓ రామారావు, సర్వేయరు రామసాయి, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం



పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎస్‌డీసీ మురళీకృష్ణ

రణస్థలం: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల ప్రకారం ఇంటింటికి ఓటర్ నమోదు సర్వే చేపట్టి అన్ని పార్టీల ఆమోదంతో 98 శాతం ప్రక్రియ పూర్తి చేసినట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి పి.మురళీ కృష్ణ తెలిపారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.సిగడాం మండలంలో ఓటర్లు 45,041 మంది ఉండగా 43,543 మంది ఓటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. లావేరులో 53,140 ఓట్లకు గాను 52,205 మంది, ఎచ్చెర్ల మండలంలో 71,402 ఓట్లకు గాను 70,478 మంది, రణస్థలంలో 66,056 ఓట్లకు గాను 65,977 మంది ఓట్లు కలిపి నియోజకవర్గంలో 2,35,639 ఓట్లకు గాను 2,32,203 ఓటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. సమావేశంలో రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల తహసీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, దిలీప్ చక్రవర్తి, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



102 నాట్లు వేస్తున్న దృశ్యం

జి.సిగడాం: లైన్‌సోయింగ్ పద్ధతులు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రాజేష్ అన్నారు. మంగళవారం మండలం జాడ గ్రామంలో పోతల త్రినాథరావు పంట పొలంలో లైన్‌సోయింగ్ విధానంలో నాట్లు వేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కషాయాల తయారీ, వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు..

'జాలిలేని బొమ్మ' పాట చిత్రీకరణ



పాటలోని ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం ప్రాంతానికి చెందిన యువకులు వివిధ రంగాల్లో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కొంతమంది షార్ట్‌ఫిల్ములు తీస్తున్నారు. తమ ప్రతిభ, కళానైపుణ్యంతో సోషల్ మీడియా వేదికగా సత్తాను చాటుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమలో ఓడిన ఓ ప్రేమికుడి ఇతివృత్తాన్ని చేసుకొని 'జాలిలేని బొమ్మ' పాటను ఈ ప్రాంతీయులు చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా పలు సన్నివేశాలను ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా, ఉద్దాన ప్రాంతాలో చిత్రీకరించారు. పాటకు సంబంధించిన ప్రోమోను ఈ నెల 24వ తేదీన విడుదల చేయనున్నట్లు యూనిట్ బృంద సభ్యులు మంగళవారం తెలిపారు. నటీనటులుగా పూజా, అరవింద్ నటిస్తుండగా, డైరెక్టర్‌గా సురేష్ సూర్యా వ్యవహరించారు. పాటను హంస్సిన్ రచించారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న రమణమూర్తినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగాలని ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు అన్నారు. ఈసెట్ ద్వారా ప్రవేశాలు పొందిన ఇంజినీరింగ్ విద్యార్థులకు కళాశాలలో మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ల పాటు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు చదవాలన్నారు. జాతీయ సాంకేతిక విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా విద్య ఉంటుందన్నారు.

మేలైన పశుగ్రాసంతో పాడిపరిశ్రమ అభివృద్ధి



లేగదూడలను పరిశీలిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మేలైన పశుగ్రాసంతో పాడిపశువులు వృద్ధి చెందడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం వత్సవలస ట్రైమెక్స్ స్కూల్ ఆవరణలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి ప్రదర్శన 23వదని, దీనివల్ల పాడి రైతులకు అనేక విషయాలు తెలుస్తాయన్నారు. ప్రతి పాడి రైతు తనకున్న భూమిలో కొంతభాగాన్ని పశుగ్రాసం పెంచేందుకు కేటాయించాలన్నారు. మేలుజాతిపశువులు పెంపకం గతంకంటే పెరిగిందని, వీటి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించిందన్నారు. పశువులకు కూడా అంబులెన్సు సౌకర్యం కల్పించిన ఘనత మన ప్రభుత్వానిదేనని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్, పశుసంవర్థక శాఖ జేడీ ఎం.కిషోర్, డీడీ జగన్మోహనరావు, ఎస్.మన్మధరావు, ఏడీ గొలివి రాజశేఖర్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, కొయ్యాన నాగభూషణం, మార్పు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

28న జీడిరైతుల మోటారు సైకిల్ యాత్ర

పలాస: జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జీడి రైతుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న మోటారు సైకిల్ యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కంచిలి నుంచి పలాస వరకు చేపట్టనున్న మోటారు సైకిల్ యాత్రలో జీడి రైతులందరూ పాల్గొనాలని కోరారు. ఆర్బీకేల ద్వారా జీడి పిక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని కోరారు. ఇందులో భాగంగా నాలుగు నెలలుగా లక్ష సంతకాల సేకరణ జరుగుతోందని చెప్పారు. ఇప్పటి వరకు 108 గ్రామాల్లో 82,500 సంతకాలు సేకరణ జరిగిందన్నారు. మోటారు సైకిల్ యాత్ర ముగిసిన తరువాత డిమాండ్లపై పలాస ఆర్డీవోకు వినతిపత్రం అందించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి తమ్మినాన భాస్కర్, అధ్యక్షుడు కొర్నాన బాలాజీ, రచయిత కుత్తుం వినోద్, కొర్ల హేమారావుచౌదరి, కోనేరు గురయ్య, కారి పురుషోత్తం, కుత్తుం డిల్లీరావు, దిలీప్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నిశ్చల

జి.సిగడాం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ నిశ్చల సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఏఈఈ మహదాసుల రమేష్, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలి

కోటబొమ్మాళి: రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు తగు సస్యరక్షణ చర్యలు చేపడితే అధికదిగుబడులు సాధించవచ్చునన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన రైతు మేడిబోయిన నారాయణరావు తన రెండు ఎకరాల్లో పండిస్తున్న బంతి, చామంతి, జీడిమామిడి, మామిడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి ఉద్యానవనశాఖాధికారి కె.సునీత, సచివాలయం అగ్రికల్చరల్ అసిస్టెంటు హరిప్రియ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి వీల్‌చైర్లు వితరణ

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన మేధావుల ఫోరం అధ్యక్షుడు జి.వి.రెడ్డి మాస్టారు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండు వీల్ చైర్లను మంగళవారం వితరణగా అందజేశారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఆస్పత్రిలో రోగులకు సహాయార్థం వీల్ చైర్లను అందజేసినట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, వైద్యులు మహారాజ్, శ్రీరాములు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆర్.రామచంద్రరావు, డి.వీరాస్వామి, డి.ఎ.స్టాలిన్, ఎ.చిట్టిన్న, కె.కామేశ్వరరావు, పి.హరిశ్చంద్రరావు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పరిధిలో నేరాలు కట్టడి చేయాలి



కేసులపై ఆరా తీస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో నేరాలు జరగకుండా కట్టడి చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక డీఎస్పీ యర్రగుంట శృతిని ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాన్ని ఎస్పీ సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్ కేసులు జరిగేందుకు అవకాశం ఉన్న గ్రామాల్లో ప్రతిరోజూ పోలీసు సిబ్బందిని పంపించి ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా గ్రామ పెద్దలతో మాట్లాడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని సీఐలు లెంక సన్యాసినాయుడు (ఒకటో పట్టణ), పప్పల శ్రీనివాసరావు (రెండో పట్టణ), పైడయ్య (ఆమదాలవలస), ఆదాం (జె.ఆర్.పురం)లను సర్కిల్ పరిధిలో జరుగుతున్న సంఘటనలు, నేరాలు, కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు వసతిగృహ విద్యార్థుల ఎంపిక

టెక్కలి రూరల్: స్థానిక వంశధార కాలనీ సమీపంలోని ఎస్టీ బాలుర వసతి గృహానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగాలకు ఎంపికైనట్లు వార్డెన్ ఎస్.సుదర్శనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో జన్ని నిఖిల్, సవర ఉదయ్ కిరణ్‌తో పాటు మరో ఆరుగురు ఉన్నారన్నారు.